క్లుప్తంగా

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



ఎర్రవల్లి: కోదండాపురం పీఎస్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 9మంది బాధితులకు రికవరీ చేసి అందజేసినట్లు శనివారం ఎస్‌ఐ మురళీ తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ నమోదు చేయాలని ఎస్‌ఐ సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ



ధరూరు: మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు . పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఆఫీసు రూంతో పాటు ఇతర గదులకు వేసిన తాళాలు దుండగులు పగులగొట్టి నోట్ పుస్తకాలు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. శనివారం పాఠశాల పరిసర ప్రాంతాల్లోని స్థానికులు సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం తెలియజేశారు. దొంగతనంపై రేవులపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో శనివారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిశీలన చేపట్టారు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు పకడ్బందీగా సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అధికారిగా బాధ్యతల స్వీకరణ



అలంపూర్: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిగా సాయి సౌజన్య శనివారం బాధ్యతలుగా స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుజాత గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సౌజన్యను సిబ్బంది శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మున్సిపాలిటీకి చెందిన విజయ్‌రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వార రూ.5 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు గోపాల్, నాయకులు నీలప్ప, రఘురెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండపేట గ్రామానికి చెందిన రామన్‌గౌడ్ (74) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి శనివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకరెడ్డి, రామన్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’పై సోషల్ ఆడిట్

- 10 నుండి 18 వరకు..
- రూ. 2.90 కోట్లకు పైగా ఉపాధి పనులు
- వసతుల కల్పనలో అధికారులపై మండిపాటు
- ఉపాధి సిబ్బందిపై కూలీల ఆగ్రహం



రాజోళిలో సోషల్ అడిట్‌పై సమావేశమైన సిబ్బంది

రాజోళి: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 10వ తేదీ శనివారం నుంచి ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. గ్రామస్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందికి పనుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గతంలో కూలీలు విన్నవించారు. ప్రస్తుతం ఆడిటింగ్‌లో భాగంగా ఇంటింటికి సిబ్బంది వెళ్తున్న క్రమంలో కూలీలు గతంలో ఎదుర్కొన్న సమస్యలు అధికారులకు వివరిస్తారా, వివరిస్తే సదరు సిబ్బందిపై ఎలాంటి చర్యలు ఉంటాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రూ.2 కోట్లకు పైగా పనులు

మండలంలో 2024- 25 సంవత్సరానికి గానూ రూ.2.90 కోట్లకు పైగా పనులు జరిగాయి. అందులో రూ.35,56,439 మెటీరియల్‌కు సంబంధించిన పనులు కాగా.. రూ.2,55,15,779 కూలీల ద్వారా జరిగినట్లు ఉపాధి హామీ సిబ్బంది ద్వారా ఇచ్చిన నివేదికలో తెలిపింది. మొత్తం 444 పనులు జరిగినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సోషల్ ఆడిట్‌లో ఎంత మేర అక్రమాలు ఇతరత్రా నిగ్గు తేలుస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రెండు విడతల్లో తనిఖీలు

గ్రామస్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి గ్రామాల వారీగా ఆరు బృందాలు తనిఖీ చేస్తాయి. రెండు విడతల్లో తనిఖీలు 10వ తేదీ నుంచి 18 వరకు జరుగనున్నాయి.

రికవరీలే తప్పా.. చర్యలు లేవు

మండలంలో గతంలో సోషల్ ఆడిట్ జరిగిన క్రమంలో పలువురు అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని తెలిసినప్పటికీ వారితో నగదును రికవరీ చేశారే తప్పా చర్యలు తీసుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూలీలు నుంచి వినిపిస్తున్న ఆరోపణల్లో కొన్ని..

- ☆ మండలంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూర్తి రోజులు పనులు కల్పించడంలో అధికారులు విఫలం
- ☆ కూలీల పేరుతో ఉపాధి హామీ సిబ్బంది వారి వేతనాలు తీసుకున్నారనే ఆరోపణలు
- ☆ వేసవి సందర్భంగా పనుల వద్ద ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులు కల్పించ లేదు
- ☆ కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సొంత పనులకు కూలీలను వాడుకుని, వారికి డబ్బులు మాత్రం ఉపాధి హామీ ద్వారా చెల్లించారు
- ☆ తమ సొంత పనులకు రాకపోతే కూలీల్లో పనిరోజులు తగ్గిస్తామని, పని లేకుండా చేస్తామని బెదిరింపులు, తదితర ఆరోపణలు సిబ్బందిపై ఉన్నాయి.

అడుగడుగునా నిర్లక్ష్యమే..

ఉపాధి హామి సిబ్బంది చాలా చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా గ్రామాల్లో పని రోజులు పూర్తిగా కల్పించ లేదు. పనులు చేసే దగ్గర కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. రాజోళిలో చాలా మంది కూలీలకు నేటికీ కూలీ డబ్బులు అందడం లేదు. ఎప్పుడు అడిగినా సాంకేతిక సమస్య అంటూ కాలం వెల్లదీస్తున్నారు. సామాజిక తనిఖీ బృందాలు పకడ్బందీగా విచారణ చేపట్టాలి.

\- విజయ్‌కుమార్, కూలీ, రాజోళి

రెండు విడతల్లో ఆడిట్

గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేసేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశాం. రెండు విడతల్లో ఈనెల 18 వరకు ఆడిట్ నిర్వహిస్తాం. వసతుల ఏర్పాటు, పని కల్పన, కూలీల విడుదల, సిబ్బంది ప్రవర్తన తదితర అంశాలన్నింటిపై విచారణ చేపడుతాం. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

\- దేవేందర్, ఎస్‌ఆర్‌పీ

సైనికుల క్షేమం కోసం పూజలు

అలంపూర్: దేశ సైనికుల క్షేమం కోసం బీజేపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, సీనియర్ నాయకులు అక్కల రమాదేవి, నాయకులతో కలిసి జోగుళాంబ సన్నిధిలో విశేష పూజలు జరిపించారు. గుంట నక్కలాంటి పాక్ చర్యలను వారి దేశ ప్రజలు కూడా క్షమించరన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల: ఉగ్రమూకలను అణిచివేస్తున్న సైనికులు క్షేమం కోసం బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ ఆధ్వర్యంలో గద్వాల కోటలోని భూలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు విజయం చేకూరాలని పూజలు చేస్తున్నట్లు జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



గద్వాలలో పూజలు చేస్తున్న నాయకులు

ప్రయాణం.. నయనానందం



ధరూరు: గద్వాల- రాయచూర్ రహదారి పక్కన ఉన్న చెట్లు విరబూసిన పూలతో వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా సరికొత్త అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. వేసవిలో ఉక్కపోతలతో ప్రయాణాలు చేస్తున్న ప్రయాణికుల కళ్లకు ఆహ్లాదానిస్తున్నాయి.

వీరజవాన్‌కు ఘన నివాళి



అయిజలో వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గద్వాలలో జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల: దేశ సరిహద్దులో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు శనివారం స్థానిక డీకే బంగ్లాలో బీజేపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. మురళీనాయక్ సేవలను దేశం గుర్తుపెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు బండల వెంకట్రాములు, అక్కల రమాసాయిబాబా, జయశ్రీ, రవికుమార్, నర్సింహులు, కిష్టన్న, దేవదాసు, పాండు, అనిల్, శంకర్, వాసు, చిత్తారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: జమ్మూలో ప్రాణాలు అర్పించిన జవాన్ మురళీనాయక్‌ను స్మరించుకుంటూ బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవాన్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, గోపాలకృష్ణ ,అశోక్, లక్ష్మణ్‌గౌడ్, శేషిరెడ్డి, నల్లన్న, వెంకటేష్, నరసింహ, రాజశేఖర్, రఘు, కృష్ణ, మధు, వీరరాఘవరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్జి స్వర్ణమల్లికకు సన్మానం



గద్వాల న్యూటౌన్: ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై న స్వర్ణమల్లిక, ఆమె తండ్రి న్యాయవాది గట్టు సురేష్‌ను శనివారం వారి స్వగృహంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్‌ఎస్ రాజోళి మండల అధ్యక్షుడు పచ్చర్ల శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్ణమల్లిక జడ్జిగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో ఆమె ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గంట పరేష్‌బాబు, పాష, గూడుసాబ్, సత్యనారాయణ, డీలర్ భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన ఫొటోగ్రాఫర్లు

ఆత్మకూర్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం, ఉపాధ్యక్షుడు నవీనశ్రీను, ప్రధాన కార్యదర్శి తౌఫీఖ్ అన్నారు. శనివారం ఫొటో స్టూడియోల బంద్ నిర్వహించి స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో సమావేశమయ్యారు. ఒకప్పుడు వినియోగదారులతో వెలిగిపోయిన ఫొటో స్టూడియోలు సెల్‌ఫోన్ల కారణంగా గిరాకులు లేక వెలవెల బోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆధునిక కెమెరాలు, రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, జగన్, తిరుపతి, అనిల్, ప్రసాద్, రంజిత్, లక్ష్మణ్, రాజశేఖర్, వెంకట్రాములు, ప్రేమ్‌కుమార్, నరేష్, రవి, నర్సింహ, ఖాజీ, శ్రీనివాసులు ఉన్నారు.

కరాటే శిక్షకులుగా ఎదగాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులకు మెరుగైన శిక్షణనిచ్చి కరాటే శిక్షకులుగా తీర్చిదిద్దాలని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే ఇండియా ఫౌండర్ చీఫ్ జీ.కృష్ణయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్‌కు నాలుగో డాన్, నవీన్‌కుమార్‌కు మూడో డాన్ హోదా కల్పించి బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ వద్ద శిక్షణ తీసుకున్న వేలాదిమంది విద్యార్థులు వివిధ బెల్టులతో పాటు మాస్టర్లుగా ఎదిగినట్లు గుర్తు చేశారు. చీఫ్ ఎగ్జామినర్, సీనియర్ మాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కరాటే విద్యకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడిందని, చిన్నారులు కరాటే శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఆధ్వర్యంలో నిరంతరం శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు

నవాబుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. శనివారం మండలంలోని కాకర్లపహాడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులు, రైతులతో మాట్లాడారు. సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములు, రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండల అధికారులు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మండల అధికారులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నరసింహ

అయిజ: ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఎత్తివేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, 8 గంటల పనిదినం, ఉపాధి హామీ పథకంలో పని దినాలను 200 రోజులుకు పెంచాలని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు మహేంద్ర, వీరేష్, ఆనంద్, నరేష్, చిట్టెమ్మ, సుశీల, రాజేష్, శివ, మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షాలేం చర్చి వార్షికోత్సవం



పాటలు పాడుతున్న మహిళలు



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి 15వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రవికుమార్ వాక్య సందేశమిచ్చారు. సంఘంలోనూ, సహవాసంలోనూ నిబద్ధతలో ఉండాలన్నారు. చెడుకు తావు లేకుండా మంచికి చోటు దక్కేలా ఆలోచన, ప్రవర్తన ఉండాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన, మహిళల గీతాలాపన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్వహణ గాలికొదిలేశారు



గట్టు సమీపంలో కోతకు గురైన రోడ్డు

గట్టు: మండల కేంద్రం నుంచి మల్దకల్ వెళ్లే రోడ్డు నిర్వహణను అధికారులు, కాంట్రాక్టర్ కలసి గాలి కొదిలేశారు. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకం ద్వారా గట్టు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మద్దెలబండమిట్ట వరకు 6.20 కిలోమీటర్ల మేరకు 2022 జనవరిలో తారు వేశారు. ఐదేళ్ల కాలానికి రోడ్డు నిర్వహణకు ప్రభుత్వం రూ.7.99 లక్షలు కేటాయించింది. ఈ నేపథ్యంలో రోడ్డు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రోడ్డు నిర్వహణ పట్టించుకోకుండా, కనీసం రోడ్డు పక్కన కోతకు గురైన చోట మట్టిని కూడా వేయడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదుపు తప్పి రోడ్డు దిగితే పెను ప్రమాదం జరుగుతుందని వాహనదారులు భయాందోళనలో ఉన్నారు. మండల కేంద్రానికి కిలో మీటర్ దూరంలో రోడ్డు వెంట మట్టి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గంగిమాన్‌దొడ్డి స్టేజీకి సమీపంలో రోడ్డు పక్కన మట్టి కోతకు గురై పెద్ద గుంత ఏర్పడినా మట్టిని కూడా వేయడం లేదు. అదే విధంగా ఆరగిద్ద స్టేజీకి సమీపంలో రోడ్డు తవ్వి అలాగే వదిలేశారు. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తున్నా, నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్న అధికారులు మాత్రం రోడ్డు నిర్వహణను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదంలో ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నాయకులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఉండవెల్లి: మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మైనార్టీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎలిజిబిత్ సుహాసిని తెలిపారు. శనివారం మైనార్టీ పెద్దలతో పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురుకులంలో ఇంటర్‌కు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. గురుకులంలో ప్రైవేటు దీటుగా ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు చిన్నబాస్ మియా, మక్తర్ బాషా, రఫీక్, మక్బుల్ బాషా, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘గుడిసెల పోరు’ పేదలకు ఇంటి పట్టాలు అందేనా



దుంపాయికుంటలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలోని సర్వే నంబర్ 534లో నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాల వ్యవహారంలో పొజిషన్‌తో పాటు హద్దులు చూపాలంటూ గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఎప్పడిస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. రెండున్నరేళ్ల కిందట పట్టణానికి చెందిన దుంపాయికుంట ఇంటి స్థలాల లబ్ధిదారులు తమకు ఇంటి స్థలాలు చూపడంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలంటూ గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోకపోవడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన తమ సమస్య తీర్చుతుందని ఆశపడినా వారి మొండిచెయ్యే దక్కింది. నిరుపేదలు పలుమార్లు సీపీఎం మద్దతుతో ధర్నాలు, అధికారులపై నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సైతం అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో దుంపాయికుంటలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి ఇంటి స్థలాల కోసం సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు కేవలం ముళ్ల పొదలను తొలగించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గెలుపోటములను సమానంగా చూడాలి



క్రీడాకారులతో ఎస్పీ రావుల గిరిధర్, ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి

వనపర్తి: ఆటలోని గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి, క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో నిర్వహిస్తున్న భూ సమేత శ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం, ఉమ్మడి తెలుగు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎస్పీ రావుల గిరిధర్ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన ఎస్పీ దేవాలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీని సన్మానించారు. సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి 2వేల నగదు బహుమానం అందజేశారు. అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, తేజవర్ధన్, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాంసుందర్, రాము, బాలగౌడ్, సోమగౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేవలం ఉపాధ్యాయుల సమస్యలపైనే పోరాటం చేశానని, ఇక నుంచి అన్నివర్గాల ప్రజల తరపున పోరాడుతానని చెప్పారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పీసీసీ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, పీఈటీల సంఘం నాయకులు నిరంజన్, ఆనంద్ ఉన్నారు.